సాక్షి పార్వతీపురం మన్యం

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



ఓజోన్‌తోనే భావితరాల బతుకు..!

ఓజోన్ పేరు విననివారు ఎవరూ ఉండరు. మానవాళికి మాస్క్‌లా కాపాడుతూ వస్తోంది.

- IIలో



భర్త అడుగుజాడల్లోనే భార్య..!

వివాహసమయంలో తోడుగా ఉంటామని వేదమంత్రాల సాక్షిగా ప్రమాణం చేసిన దంపతులు మరణంలోనూ ఒకరి తరువాత మరొకరు తుదిశ్వాస విడిచారు.

- IIలో

నేడు కాపునేస్తం నిధుల విడుదల

పార్వతీపురం: వైఎస్సార్ కాపునేస్తం నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేస్తారని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఆర్.గడ్డెమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1520 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.15వేల చొప్పున జమ కానుందన్నారు.

న్యూస్‌రీల్

ఉద్యోగుల స్పందనకు 12 వినతులు



ఉద్యోగుల వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఉద్యోగుల స్పందనకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని కలెక్ట ర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించా రు. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉద్యోగుల గ్రీవెన్స్‌కు జీతభత్యములు, ఇంక్రిమెంట్లు, బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలపై 12 మంది అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో జె.వెంకటరావు పాల్గొన్నారు.

12 అడుగుల కింగ్ కోబ్రాహతం



చోళ్లపదం గ్రామంలో హతమైన కింగ్ కోబ్రా

కొమరాడ: మండలంలోని చోళ్లపదంలో 12 అడుగుల కింగ్ కోబ్రాను స్థానికులు శుక్రవారం హతమార్చారు. గ్రామంలోని మెయిన్ రోడ్డులో పాము అలజడి సృష్టించడంతో వెంటనే యువకులు తేరుకుని కర్రలతో కొట్టి చంపారు.

జాబ్‌మేళాలో 102 మంది ఎంపిక

విజయనగరం అర్బన్: నగరంలోని తోటపాలెం సత్యడిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. హెటిరో లాబ్స్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బి-ఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, డిప్లమా మెకానికల్ మరియు ఐటీఐ ఫిట్టర్ విద్యార్హత గల అభ్యర్థులు 300 మంది హాజరయ్యారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ అనంతరం 102 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెటిరో ల్యాబ్స్ నక్కపల్లి, విశాఖ పట్టణం జిల్లా యూనిట్ హెచ్‌ఆర్‌టీమ్ మేనేజర్ వంశీ, మణికంఠ సత్యవిద్యాసంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సాయిదేవమణి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.ఉదయ్‌కిరణ్, ఎన్ఎస్ఎస్ పీఓ బి.సూరపునాయుడు పాల్గొన్నారు.

చురుగ్గా సరిహద్దురాళ్ల ఏర్పాటు



బానాదిలో సర్వేరాళ్లు వేయడాన్ని పరిశీలిస్తున్న ఎ.డి త్రివిక్రమరావు

వేపాడ: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకంలో భాగంగా భూములు సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దురాళ్లు పాతుతున్నట్టు సర్వేశాఖ ఎ.డి.త్రివిక్రమరావు తెలిపారు. మండలంలోని బానాది, బి.టి.కె.రాజపురం రెవెన్యూ గ్రామాల్లో సర్వే హద్దురాళ్ల ఏర్పాటు ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలిచ్చారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ బానాదిలో 637 సర్వేరాళ్లు, బి.టి.కె.రాజపురంలో 188 సర్వే రాళ్లు వేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పలనాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు, సర్పంచ్ కర్రి యశోద తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల టర్నోవర్ దాటితే వృత్తిపన్ను

- వాణిజ్య పన్నులశాఖ సహాయ కమిషనర్ అచ్చయ్య

కొత్తవలస: ఏడాదికి రూ.10 లక్షల టర్నోవర్ దాటిన ప్రతివ్యాపారి వృత్తిపన్ను చెల్లించాలని వాణిజ్య పన్నుల సహాయ కమిషనర్ గంటనపల్లి అచ్చయ్య స్పష్టంచేశారు. మండలంలోని సబ్బవరం రోడ్డులోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో జీఎస్టీ చెల్లింపులు, చట్టంలో మార్పులపై వ్యాపారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. నిర్ణీత సమయంలో ఐటీ రిటర్న్స్, జీఎస్టీ చెల్లింపులు చేయాలని సూచించారు. సమయానుకూలంగా వార్షిక రిటర్న్స్ సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఏసీటీఓ శంకరరావు, డీసీటీఓ వెంకటేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు తాతబాబు, విన్నకోటి గౌతం తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు, సిబ్బందితో ముఖ్యమంత్రి గ్రూప్ ఫొటో





విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి. పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కల సాకారమైన వేళ.. ఆనంద హేల

- విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- జననేతకు ఘనంగా స్వాగతం పలికిన జిల్లా వాసులు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఆధ్వర్యంలో వందలాది బైక్‌లతో ర్యాలీ
- సాంస్కృతిక ప్రదర్శనలతో పండగ సందడి
- రాజకీయాలకు తావులేకుండా సాగిన సీఎం పర్యటన



విజయనగరం/రూరల్/ఫోర్ట్/ అర్బన్: చిరకాల స్వప్నం సాకారమైన వేళ.. విద్యలనగరంలో పండగ సందడి నెలకుంది. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభానికి శుక్రవారం విజయనగరం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. వందలాది బైక్‌లతో వెంట సాగారు. సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిచేశారు. వైద్య కళాశాలను అందుబాటులోకి తెచ్చిన జననేతపై అభినందనల జల్లు కురిపించారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులతో తమ అభిమానాన్ని వ్యక్తంచేశారు. వైద్యవిద్యతో పాటు పేదల ఆరోగ్యానికి పాటుపడుతున్న జగనన్నకు జేజేలు పలికారు. జిల్లాలో అడుగుపెట్టిన నుంచి తిరిగి వెళ్లిన వరకు జననేత వెంట సాగారు.

విద్యామణిహారం.. వైద్య కళాశాల

విజయనగరం జిల్లాలో ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాల విద్యామణిహారంగా నిలవనుందని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ పేర్కొన్నారు. జిల్లా వాసుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ, ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమమంలో కలెక్టర్ ప్రారంభోపన్యాసం చేశారు. నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభోత్సవంతో ప్రజలకు మరింతగా మెరుగైన వైద్యం అందడంతో పాటు వైద్యవిద్యనభ్యసించాలనే విద్యార్థులకు రాష్ట్రంలో మొత్తం 2,550 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మరింతమంది పేద విద్యార్థులకు మేలు చేకూరుతుందని తెలిపారు. విజయనగరం మెడికల్ కళాశాలలో ఈ ఏడాదే తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. ఇప్పటికే కళాశాల మొదటి బ్లాక్, హాస్టల్ బ్లాక్ పూర్తయ్యాయని చెప్పారు. డిసెంబర్ నాటికి మొత్తం పూర్తిచేస్తామన్నారు. వైద్య కళాశాలకు సంబంధించి 22 విభాగాల్లో 174 పోస్టు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతోందని, కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వైద్య కళాశాలను మంజూరు చేసినందుకు జిల్లా వాసుల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



వైద్యకళాశాలను తదేకంగా చూస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రాజకీయాలకు తావులేకుండా..

ముఖ్యమంత్రి విజయనగరం జిల్లా పర్యటన ఎటువంటి రాజకీయాలకు తావులేకుండా సాగింది. గాజులరేగలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఎక్కువ సమయం కళాశాల నిర్మాణం తీరు, కల్పించిన సౌకర్యాలను నిశితంగా పరిశీలించేందుకే కేటాయించారు. విజయనగరం నుంచే రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను వర్చువల్ విధానంలో ప్రారంభించి ఆయా కళాశాలల విద్యార్థులతో ముచ్చటించేందుకే అధిక సమయం వెచ్చించారు. ఒక్క రాజకీయ ఆరోపణ కూడా చేయలేదు. బంగారు భవితకు బాటలు వేసుకోవాలని వైద్య విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. డాక్టర్లగా ఉత్తమ సేవలందించాలని సూచించారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

గాజులరేగ ప్రాంతంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి విజయనగరం చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా యంత్రాంగం, పాలకులు స్వాగతం పలికారు. కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. నేతలందరినీ సీఎం చిరునవ్వుతో పేరుపేరున పలకరించారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీలు డాక్టర్ సురేష్ బాబు, ఇ.రఘురాజు, పాలవలస విక్రాంత్, వరుదు కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, శంబంగి చిన అప్పలనాయుడు, కంబాల జోగులు, పాముల పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, కళావతి, గొర్లె కిరణ్‌కుమార్, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, గిరిజన కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ అవనాపు భావన, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, విజయనగరం కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్, జిల్లా అధికారులు ఉన్నారు.

భారీ బైక్ ర్యాలీ

ముఖ్యమంత్రి పర్యటనకు సంఘీభావంగా నగరంలోని భగవాన్‌నగర్‌లోని డిప్యూటీ స్పీకర్ నివాసం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ నగరంలోని ప్రధాన మార్గాలగుండా ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్దకు చేరుకుంది. ర్యాలీలో వేలాది మంది యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీంతో నగరమంతా సందడి వాతావరణం నెలకొంది. బైక్‌ర్యాలీని ప్రారంభించిన ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చరిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు. జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారమైందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ కళాశాల మంజూరు చేయడంతో పాటు కళాశాల నిర్మాణ పనులు చేపట్టి తరగతులు ప్రారంభించిన ముఖ్యమంత్రి జిల్లా ప్రజలందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దీనికి కృతజ్ఞతగా బైక్‌ర్యాలీ నిర్వహించినట్టు చెప్పారు.

ఆత్మీయ సత్కారం..





సీఎంను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైద్య కళాశాల సిబ్బంది

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యమంత్రి కృష్ణబాబు, ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అప్పలనాయుడు దుశ్శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు.

ముఖ్యమంత్రి పర్యటన సైడ్‌లైట్స్

విజయనగరం: విజయనగరం జిల్లాలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ముందస్తుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సమయానికి ప్రారంభమై, ముగిసింది.

- ఉదయం 10.15 గంటలకు ద్వారపూడి పంచాయతీ పరిధిలోని జేఎన్‌టీయూ రోడ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు.
- అక్కడ జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలికారు.
- 10.34 గంటలకు హెలిప్యాడ్ నుంచి గాజులరేగలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బయలుదేరారు.
- 10.48 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- 10.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 10.53 గంటలకు ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్దకు చేరుకున్నారు.
- అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శిలాఫలకాన్ని ఆవిష్కరించి వైద్య కళాశాలను ప్రారంభించారు.
- 10.55 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.
- 11.07 గంటల నుంచి 11.24 గంటల వరకు కళాశాలలోని స్కిల్, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లను నిశితంగా పరిశీలించారు.
- 11.34 గంటలకు కళాశాల మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కాన్ఫెరెన్స్ హాల్‌కు చేరుకున్నారు.
- వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని మరో నాలుగు కళాశాల ప్రారంభోత్సవం చేసిన అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.
- మధ్యాహ్నం 12.40 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి 1.10 గంటల వరకు మాట్లాడారు.
- 1.13 గంటలకు వైద్య విద్యార్థులతో కాన్ఫెరెన్స్ హాల్‌లో ఫోటోలు దిగి వారిని అభినందించారు.
- అనంతరం అక్కడి నుంచి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని అనారోగ్య బాధితులను పరామర్శించారు.
- 1.56 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖకు పయనమయ్యారు.

దారిపొడవునా జేజేలు..



సాంస్కృతి ప్రద్శనల సందడి

విజయనగరం నియోజకవర్గానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ అభిమాన నేతకు ఆత్మీయ స్వాగతం పలికారు. ధర్మపురి పంచాయతీ పరిధిలోని జేఎన్‌టియూ రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద నుంచి గాజులరేగ ప్రాంతంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చేరుకునే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున ప్రజలు బారుతీరి జై జగన్... జైజై జగన్... థాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. ముఖ్యమంత్రి వెళ్లే రోడ్డు మార్గంలో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో 10 చోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతి ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విశ్వేశ్వరయ్య వారసులుగా గర్వించాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం:

ఇంజినీర్లందరూ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య వారసులుగా గర్వించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జిల్లా పంచాయతీరా జ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇంజినీర్స్ డేలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి ఎనలేని సేవలందించారని, తుంగభద్ర, కృష్ణారాజసాగరం వంటి ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు ఆయన ఇంజినీరింగ్ నైపుణ్యాలకు ప్రతీకలుగా నిలిచాయన్నారు. తన విశిష్ట సేవలతో ఇంజినీర్ నుంచి మైసూర్‌కు దివాన్‌గా పనిచేసిన గొప్ప వ్యక్తిగా పేర్కొన్నారు. విశ్వేశ్వర య్య స్ఫూర్తితో ఇంజినీరింగ్ ఉద్యోగులందరూ విధుల్లో ప్రతిభ చూపాలన్నారు. జిల్లాలో ప్రాధాన్య త పనులను సకాలంలో పూర్తిచేయడం వల్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశంసించారన్నారు. పాలన అధికారులు, ఇంజినీర్లు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. రక్తదానం చేసిన ఇంజినీరింగ్, సమాచార పౌర సంబంధాలు, ఇతర శాఖల సిబ్బందిని అభినందించారు. పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఇంజినీర్లపాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. విశ్రాంత పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.వి.ఆర్.వెంకటరావు మాట్లాడుతూ సమాజ స్థిరత్వానికి ఇంజినీర్లు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాల ప్రయోజనాలపై స్పష్టమైన భాగస్వామ్యం ఉండాలని తెలిపారు. అప్పుడే మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు అసలైన వారసులం కాగలమన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ప్రయోజనం ఇంజినీర్‌గా కల్పించాలని ఆయన సూచించారు. సుస్థిర అభివృద్ధికి అంకితం కావాలని స్పష్టం చేశారు. సమాజాన్ని ప్రేమించాలని, సమాజానికి ఎంతో కొంత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రాధాన్యతా భవనాల నిర్మాణంలో బాగా పనిచేసిన ఇంజినీరింగు సహాయకులకు జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్ ఈఈ మల్లిఖార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ జె. శాంతీశ్వరరావు, ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఉత్తమ సేవలందించిన ఇంజినీర్లకు జ్ఞాపికలను బహూకరిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

ఏబీరోడ్డులో ట్రాఫిక్‌జామ్



దిమ్మిడిజోల వద్ద ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు, (ఇన్‌సెట్‌లో) ఏబీ రోడ్డులో అడ్డంగా భారీ తారాస్

భామిని: ఏబీ రోడ్డులో శుక్రవారం భామిని మండలం దిమ్మిడిజోల వద్ద రోడ్డుకు అడ్డంగా దిగబడిన భారీ తారాస్ (లారీ)తో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగాయి. గురువారం రాత్రి కొత్తూరు వైపు నుంచి భామిని వస్తున్న తారాస్ వర్షం కారణంగా ఒడిశా వెళ్లకుండా వెనుదిర గాలనే ఉద్దేశంతో సైడ్‌కు తీయగా తారాస్ వెనుక భాగం రోడ్డుపక్క పొలాల్లో దిగబడి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. స్థానికుల సహాయంతో జేసీబీలతో రాత్రంతా ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు. బత్తిలి ఎస్సై యతిరాజుల అమ్మాన్ రావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఉదయం ట్రాఫిక్‌ను తొలగించి రెండువైపులా రాకపోకలకు అవకాశం కల్పించారు.

మినీ వ్యాన్ బోల్తా



వంతెనపై బోల్తా పడిన మినీవ్యాన్

భోగాపురం: స్థానిక జాతీయ రహదారి వంతెనపై మినీ వ్యాన్ శుక్రవారం ఉదయం బోల్తా పడింది. మండలంలోని మహరాజుపేట గ్రామం నుంచి ఇటుకల లోడుతో రామచంద్రపేట గ్రామానికి వెళ్తుండగా జాతీయరహదారిలో వంతెనపైకి చేరుకునేసరికి వ్యాన్ టైర్ పంక్చర్ అవడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ కోసర రమణ, వ్యాన్‌లో ఉన్న మరోవ్యక్తి మోపాడ ఈశ్వరరావు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జేసీబీ సహాయంతో వ్యాన్‌ను పక్కకు తీశారు.

గాజుల అలంకరణలో దాడితల్లి



ప్రత్యేకాలంకరణలో దాడితల్లి

బొబ్బిలి: స్థానిక గొల్లపల్లిలో కొలువైన దాడితల్లిని గాజులతో శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన గాత్ర కచేరీ



గాత్రకచేరీ చేస్తున్న శృతిరవళి

విజయనగరం టౌన్: పట్టణంలోని రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో భారతరత్న ఎంఎస్.సుబ్బలక్ష్మి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఐర్లాండ్‌కు చెందిన వంక శృతిరవళి తన గాత్రంతో అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ధవళ సర్వేశ్వరరావు సుబ్బలక్ష్మి గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మండపాక రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹143	₹256	₹ 266

ఓజోన్‌తోనే భావితరాల బతుకు..!

- తగ్గుతున్న అడవులతో పొంచిఉన్న ప్రమాదం
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- పెరుగుతున్న వాయు కాలుష్యం
- నేడు ఓజోన్ దినోత్సవం





రాజాంలోని ఓ పొలంలోకి మురుగునీటితో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు

రాజాం: ఓజోన్ పేరు విననివారు ఎవరూ ఉండరు. మానవాళికి మాస్క్‌లా కాపాడుతూ వస్తోంది ఓజోన్ పొర. సూర్యుని అతి నీలలోహిత సూర్యకిరణాలు భూమి మీద పడకుండా కాపాడుతూ జీవజాతిని అభివృద్ధి చేస్తోంది. మానవాళిని కాపాడుతున్న ఓజోన్ పొరను మాత్రం కాపాడలేకపోతున్నాం. ఇప్పటికీ రెండు చోట్ల ఓజోన్‌పొర విచ్ఛిన్నమై ప్రమాదఘంటికలు సూచించింది. అయినప్పటికీ మానవాళి మనుగడలో మార్పురాక వాయు, శబ్ద, జల కాలుష్యాలతో వాతావరణాన్ని అసమతుల్యత చేసి ఓజోన్‌కు నష్టం కలిగిస్తున్నారు. విచ్చలవిడిగా అడవులు నరికివేయడం, నదీజలాలను కలుషితం చేయడం, పంటపొలాల్లో రసాయన ఎరువుల వినియోగంతో పర్యావరణ అసమతుల్యత వస్తోంది. నేడు ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అంతరించిపోతున్న అడవులు..

ఓజోన్ పొరకు అత్యంత అవసరమైన పచ్చని అడవులు అక్రమంగా కోతకు గురవుతున్నాయి. విజయనగరం జిల్లాలో పదేళ్లక్రితం 1,11,978 హెక్టార్లలో అటవీప్రాంతం ఉండేది. ప్రస్తుతం 90 హెక్టార్లకు తగ్గిపోయింది. అత్యధికంగా కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో అనధికారికంగా చెట్లు నరికివేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో సమస్య ఏర్పడింది. ఎక్కడికక్కడే విచ్చలవిడిగా టింబర్ డిపోలు ఉండడంతో అక్రమ కలప వ్యాపారం పెరిగి, విలువైన అటవీసంపద కనుమరుగవుతోంది.

నదీతీరాల్లో వ్యర్థాలు

జిల్లాలో నాగావళి, గోస్తని, సువర్ణముఖి, చంపావతి, వేగావతి, గోముఖి నదులు ఉన్నాయి. అపారమైన జలవనరులు ఉన్న ఈ ప్రాంతాల్లో నదీతీరాల్లో వ్యర్థ జలాలు, కలుషిత ఆహార పదార్థాలు, పశుకళేబరాలు, రసాయనాలు విడిచిపెడుతున్నారు. ప్లాస్టిక్ సంచులు, బాటిల్స్ నదుల్లో పారవేస్తున్నారు. ఫలితంగా నదీజలాలు కలుషితమవుతున్నాయి.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం..

జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ప్లాస్టిక్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. అనుమతులు లేకుండా ప్లాస్టిక్‌ను వినియోగించడమే కాకుండా జనావాసాల మధ్య వాటిని దగ్ధం చేస్తూ వాతావరణ కాలుష్యం తెచ్చిపెడుతున్నారు.

ఓజోన్ పొరను ఇలా కాపాడాలి

ఓజోన్ పొరను దెబ్బతీసే పదార్థాల వాడకాన్ని గణనీయంగా తగ్గించుకోవాలి.

- రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలి.
- పెట్రోలియం ఉత్పత్తుల వాడకం తగ్గించుకోవాలి. వీలైనంతగా ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలి. పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలతో నడిచే వాహనాల నుంచి వెలువడే పొగ ఓజోన్ పొరను దెబ్బతీస్తుంది.
- ఏసీలు, రిఫ్రిజిరేటర్లలో ఏవైనా లీకేజీలు ఉన్నాయా..అన్నది తరచూ పరీక్షించుకోవాలి. రిఫ్రిజిరేటర్ వెనుక భాగానికి గాలి తగిలేలా ఉంచడం, ఫ్రీజర్ బాక్స్‌లో తగినంత ఉష్ణోగ్రత ఉండేలా, ఉపయోగంలో లేనప్పుడు ఆఫ్ చేయడం చేయాలి.

మొక్కలు నాటాలి



పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. ప్రతి చోటా మొక్కలునాటే కార్యక్రమం చేపడుతోంది. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. భావితరాలు సురక్షితంగా ఉండాలంటే ఓజోన్‌పొరను కాపాడుకోవాలి. పర్యావరణ పరిరక్షణ ద్వారా మాత్రమే అది సాధ్యం.

– డీటీవీ కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్, రాజాం

అందరిదీ బాధ్యత...



ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత. ప్రధానంగా అడవులను పెంచాలి. నదీజలాలు కలుషితం కాకుండా కాపాడుకోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు దగ్ధం చేయకుండా చూడాలి. ధ్వని కాలుష్యాన్ని నియంత్రించాలి. మొక్కలు నాటాలి. నీటి కాలుష్యాన్ని తగ్గించాలి.

– జి.భాగ్యలక్ష్మి, ఎన్విరాన్‌మెంట్ ఏఈ, రాజాం

కొడుకు చేతిలో తల్లి బలి

- హత్యచేసి లొంగిపోయిన ప్రబుద్ధుడు



రమణమ్మ మృతదేహం



ఘటనా స్థలంలో స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న ఎస్సై జయంతి, హెచ్‌సీ సత్యనారాయణ

రామభద్రపురం: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లినే హత్య చేశాడో ప్రబుద్ధుడు. రామభద్రపురం మండలకేంద్రంలోని వసంతలవీధిలో శుక్రవారం జరిగిన ఈ హృదయ విదారక సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానికురాలైన ఉప్పల రమణమ్మ(75)కు ఆరుగురు పిల్లలు. వారిలో ముగ్గురు మగ, ముగ్గురు ఆడపిల్లలు. ఇద్దరు మగ పిల్లల్లో పెద్ద వాడు రాజాంలో కుటుంబంతో ఉంటున్నాడు. రెండవ వాడు కొన్నేళ్ల కిందట చనిపోయాడు. ఆడపిల్లలకు వివాహమై అత్తవారిళ్లలో ఉన్నారు.అందరికంటే చిన్నవాడైన శ్రీనివాసరావు తల్లి వద్ద ఉంటూ రామభద్రపురం జంక్షన్‌లో చిన్న టిఫిన్ కొట్టుపెట్టుకుని జీవనం సాగిస్తూ మద్యానికి బానిసయ్యాడు. టిఫిన్‌కొట్టు మీద వచ్చిన డబ్బులు రోజూ తాగేసి ఇంటికి వెళ్లేవాడు.ఆ డబ్బులు చాలక తాగేందుకు తల్లిని రోజూ డబ్బులు అడుగుతూ గొడవ పడేవాడు. ఇంట్లో వంట చేసేందుకు గ్యాస్ లేదు ఎలా వండుతానని, వచ్చిన పెన్షన్ డబ్బులతో ఇల్లు గడవక ఇబ్బంది అవుతోంది. రోజూ తాగేసి వస్తే ఎలా? అని తల్లి వాపోయేది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూడా శ్రీనివాసరావు టిఫిన్ కొట్టు తెరవకుండా మద్యం తాగేందుకు తల్లిని డబ్బులు అడిగాడు. తన దగ్గర లేవని చెప్పడంతో పెన్షన్ డబ్బులు ఉంటాయి కదా ఇవ్వకపోతే ఎలా? అని ప్రశ్నించి పక్కనే ఉన్న మసాలాలు దంచే రాడ్డుతో తల్లి తలపై మోది హత్య చేశాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాడంగి ఎస్సై జయంతి, హెచ్‌సీ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపక్కన మృతదేహం



సింహాచలం నాయుడు మృతదేహం

శృంగవరపుకోట: విశాఖ–అరకు రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి అచేతనంగా పడి ఉండడంతో స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 సిబ్బంది వెళ్లి చూసి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించి ఎస్.కోట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి మృతుడిని దేవరాపల్లి మండలం సమిది గ్రామానికి చెందిన దొమ్మంగి సింహాచలం నాయుడు(36)గా గుర్తించారు. సింహాచలం నాయుడు మధ్యాహ్నం 1.30 సమయంలో బొడ్డవర నుంచి ఎస్.కోట వస్తుండగా ఓ స్కూల్ వద్ద పడిపోయినట్లు తెలిసిందని పోలీసులు చెప్పారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తారకేశ్వర రావు తెలిపారు.

భర్త అడుగుజాడల్లోనే భార్య..!



మృతిచెందిన భార్యాభర్తలు నారాయణరావు, సూర్యం

పూసపాటిరేగ: వివాహసమయంలో తోడుగా ఉంటామని వేదమంత్రాల సాక్షిగా ప్రమాణం చేసిన దంపతులు మరణంలోనూ తోడుగా ఉంటూ ఒకరి తరువాత మరొకరు తుదిశ్వాస విడిచారు. భర్త మరణం జీర్ణించుకోలేని భార్య కొద్ది గంటల వ్యవధిలోనే తనువు చాలించింది. పూసపాటిరేగ మండలంలోని ఎరుకొండ గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బలగం నారాయణరావు (65) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందాడు. భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య బలగం సూర్యం(60) గంటల వ్యవధిలోనే తుదిశ్వాస విడిచింది. ఈ దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ ఆర్ఐ మృతి

విజయనగరం క్రైమ్: సాలూరు మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ విజయనగరంలోని ఆర్అండ్‌బీ రైతుబజార్ సమీపంలో నివాసం ఉంటున్న త్రిపురాన రమేష్ (59) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఇటీవల భార్య అనారోగ్యానికి గురవడంతో మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరిట వసూలు

- ఈనెల 13న పలు షాపుల్లో తనిఖీ
- వ్యాపారుల దగ్గర ఓ వ్యాపారి వసూలు
- ఎవరికీ ముట్టని రసీదులు
- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నంటూ హోటల్స్‌లో మరో వ్యక్తి వసూళ్లు



ఈనెల 13న అమరావతి కాంప్లెక్స్ వద్ద కిరాణాషాపులో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రామయ్య



ఓ స్వీట్ షాపులో ఫుడ్ ఇన్స్‌పెక్టర్ తనిఖీలు చేస్తున్నట్లు సీసీ టీవీలో నమోదైన దృశ్యం

వీరఘట్టం: ఇటీవల వీరఘట్టం మండల కేంద్రంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరిట అక్రమ వసూళ్ల దందా సాగుతోంది. వీరఘట్టానికి చెందిన ఓ వ్యాపారి అందరి వర్తకుల నుంచి డబ్బులు వసూలు చేసి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే మరో వ్యక్తి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరిట హోటల్స్ యజమానులకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ కథాకమామిషు..!

ఈనెల 13న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్య వీరఘట్టం మండల కేంద్రంలోని పలు కిరాణా షాపులు, హోటల్స్, స్వీట్ షాపుల్లో తనిఖీ చేసి తగు సూచనలు చేశారు.ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేసిన ప్రతి షాపులో స్థానిక ఓ వ్యాపారస్తుడు సదరు షాపు యజమానుల నుంచి రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేసి ఫుడ్ఇన్స్‌పెక్టర్‌కు ఇచ్చినట్లు షాపు యజమానులు చెబుతున్నారు. అయితే తీసుకున్న డబ్బులకు ఎవ్వరికీ రసీదులు ఇవ్వలేదు. ఇదిలా ఉండగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వీరఘట్టం వచ్చిన రోజే మరో వ్యక్తి కొన్ని హోటల్స్‌కు వెళ్లి లైసెన్సులు తీసుకోవాలని చెప్పి రూ.1350 చొప్పున వసూలు చేశాడు. కొందరు షాపుల యజమానులు తర్వాత ఇస్తామని చెప్పడంతో తర్వాత వారికి ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. డబ్బులు కట్టకపోతే షాపులను మూయించేస్తానని హెచ్చరించాడు. ఫోన్ 8019464277 నంబర్‌తో షాపుల యజమానులకు ఫోన్లు చేసి బెదించడంతో వారు కాల్ రికార్డ్ చేసి జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌కు విషయం తెలియజేశారు. అయినా సరే జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్పందించకపోవడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎవరు నకిలీ? ఎవరు ఒరిజినల్?

ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాకు కొత్తగా వచ్చిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్యతో పాటు మరో వ్యక్తి కూడా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నంటూ షాపుల యజమానుల వద్ద వసూళ్లకు పాల్పడుతుండడంతో వారిద్దరిలో ఎవరు ఒరిజినల్, ఎవరి నకిలీ అధికారో తెలియక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

మాకు సంబంధం లేదు

వీరఘట్టంలో హోటల్స్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ వై.రామయ్య వద్ద సాక్షి ప్రస్తావించగా ఆ వ్యక్తికి తమకు ఎటువంటి సంబంధం లేదని సమాధానమిచ్చారు. అంతేకాకుండా ఈనెల 13న వీరఘట్టంలో ఒకే షాపులో తాను తనిఖీ చేసినట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పలు షాపుల్లో సోదాలు చేసినట్లు సీసీ టీవీ ఫుటేజిలు ఉన్నాయి. పలు షాపుల్లో తనిఖీలు చేసినప్పటికీ ఒక్క కిరాణా షాపులోనే తనిఖీ చేశానని చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందాపై కలెక్టర్ స్థాయి అధికారులు దృష్టి సారించాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

పరిపాలన సామర్థ్యాల పెంపుకోసం శిక్షణ

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రాష్ట్ర డైరెక్టర్ మురళి



మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ మురళి

విజయనగరం రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పరిపాలనలో సామర్థ్యాలను పెంపొందించడానికే రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ జె.మురళి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పంచాయతీ కార్యదర్శుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ స్థాయి ప్రభుత్వాలకు సారథ్యం వహిస్తున్న కార్యదర్శులు తమకున్న అధికారంతో ప్రజోపయోగమైన పనులు చేయాలని సూచించారు. గ్రామ కంఠం భూముల్లో నివాసం ఉన్న ప్రజల ఇళ్లకు హక్కు కల్పించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న స్వమిత్వ కార్యక్రమంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పంచాయతీల్లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ ఆస్తులను పంచాయతీ కార్యదర్శులే కాపాడాలని హితవు పలికారు. విధి నిర్వహణలో ఒత్తిడిని జయించాలంటే మానసిక ప్రశాంతత పొందడానికి ధ్యానం చక్కని సాధనమని సూచించారు. జిల్లా ఆఫీసు మాన్యువల్ సీసీఏ రూల్స్ పట్ల అవగాహన పెంపొందించుకుని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కె.రాజ్‌కుమార్, ఏవో ఏవీ కామేశ్వరరావు, శిక్షణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఎ.దేవుడు, జయ రామలక్ష్మి, రవికిరణ్, వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మంటపాలకు అనుమతులు తప్పనిసరి అని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీసు వారి అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు తీసుకురావాలని సూచించారు. మంటపాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా, విద్యుత్ వైర్లు, లైట్ల వినియోగంలో ముందస్తు జాగ్రత్తలు వహించాలని తెలిపారు. మంటపాల వద్ద సౌండ్‌బాక్సులతో ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించవద్దని హితవు పలికారు. ఉత్సవాల్లో బాణసంచా కాల్చకూడదని చెప్పారు. మంటపాల వద్ద మద్యం తాగి డ్యాన్సులు, నాటకాలు వంటిని ప్రదర్శించవద్దన్నారు. ఊరేగింపు సమయాల్లో కండిషన్‌లో ఉండే వాహనాలను ఉపయోగించాలని, లైసెన్స్‌లు ఉన్న డ్రైవర్లు మాత్రమే వాహనాలు నడపాలని కోరారు. ఊరేగింపు సమయాల్లో పోలీసు వారి అనుమతి లేకుండా డీజేలు, బాణసంచా కాల్చడం నేరమన్నారు. ఉత్సవ నిర్వాహకులు మంటపాల్లో రాత్రివేళ ఉండాలని సూచించారు. అవసరమైతే సీసీ కెమెరాల ఏర్పాటు మంచిదని అభిప్రాయపడ్డారు. పోలీసు అనుమతులు లేకుండా ఉత్సవాలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

జేఎన్‌టీయూ జీవీలో ఘనంగా ఇంజినీరింగ్ డే



జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్

విజయనగరం అర్బన్: భారతరత్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతిని పురస్కరించుకుని స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనరం (జీవీ) యూనివర్సిటీలో గురువారం ఇంజినీరింగ్ డేను ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రాంగణంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇంజినీర్లు ప్రొఫెషనల్‌గానే కాకుండా సోషల్ యాక్టివిటీస్‌లో కూడా పాల్గొనాలని సూచించారు. ఎన్నో అద్భుత ప్రాజెక్టుల నిర్మాణంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన వంతు సేవలందించి దేశాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ (నీటిపారుదల శాఖ) ఐఎస్ఎన్‌రాజు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సివిల్ ఇంజినీర్ల పాత్ర చాలా కీలకమని మెరుగైన ఆలోచనల ఆ్వరా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామినాయుడు సత్కరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిహారం అందజేత..



చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ ఆర్ఎం రామకృష్ణరాజు, ఇతర బ్యాంకు అధికారులు

డెంకాడ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ రామకృష్ణరాజు శుక్రవారం రూ. 20 లక్షల పరిహారం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. వెంపడాంనకు చెందిన లెంక పైడన్న అనే రైతు ఏపీజీవీబీ డెంకాడ బ్రాంచ్‌లో భద్రత పథకంలో భాగంగా రూ. వెయ్యితో ఇన్సూరెన్స్ చేయించుకున్నాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పైడన్న మృతి చెందడంతో మంజూరైన రూ. 20 లక్షల పరిహారాన్ని ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రామకృష్ణరాజు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సురేష్, ఎఫ్ఐసీ అధికారి కిషోర్, ఏపీజీవీబీ డెంకాడ బ్రాంచ్ మేనేజర్ పైడి కొండబాబు, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవల్లిక, ఏపీఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.